
ప్రజాశక్తి
శుక్రవారం 10 అక్టోబర్ 2025 | 5 | విజయనగరం



నేడు, రేపు ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్-కమ్-సేల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 10,11 తేదీల్లో ప్రభుత్వ సంగీత కళాశాల ప్రాంగణంలో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్-కమ్-సేల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు. సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్ పథకం లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న తగ్గిన పన్ను రేట్ల విధానం ద్వారా వినియోగదారులకు లాభం చేకూరుతుందని, ప్రదర్శనలో టెలివిజన్లు, ఎయిర్ కండిషనర్లు, డిష్‌వాషర్లు, స్మార్ట్‌హోమ్ పరికరాలు, ఆరోగ్య పరికరాలు వంటి వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లో వివిధ ఎలక్ట్రానిక్ డీలర్లు తమ తాజా ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, గృహోపకరణాలు, స్మార్ట్ హోమ్ సొల్యూషన్స్, ఆరోగ్య పరికరాలు మొదలైన వాటిని ప్రదర్శన, అమ్మకానికి ఉంచుతారని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన తగ్గిన పన్ను రేట్ల విధానం కారణంగా వినియోగదారులకు తక్కువ ధరకే ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు.

బిజెపి సహకారంతోనే అరాచకాలు



విజయనగరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సిజెఐపై దాడిని ఖండిస్తూ సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన మతోన్మాద దాడిని దేశంలో ప్రజలందరూ ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. సిజెఐ పై దాడిని ఖండిస్తూ గురువారం స్థానిక విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సాక్షిగా ప్రధాన న్యాయమూర్తి గువాయిపై బూటు తో దాడి చేయడం హేయమైన చర్యని,. దేశ చరిత్రలోనే ఇది మాయని మచ్చని అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపైనా, భారత రాజ్యాంగంపైనా జరిగిన దాడిగా అభివర్ణించారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి దాడులు పెచ్చు మీరుతున్నాయని అన్నారు. బిజెపి, తన మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ఇలాంటి అరాచక మూకలకు సహకారంగా నిలుస్తున్నాయని అన్నారు. దేశంలో న్యాయమూర్తులకే రక్షణ ఇవ్వలేని ప్రభుత్వాలు సాధారణ ప్రజలకు ఏమి రక్షణ కల్పిస్తాయని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరి అభిప్రాయాన్ని వారు స్వతంత్రంగా చెప్పుకోవచ్చని అలా చెప్పిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై సనాతన ధర్మాన్ని కించపరిచారని హిందూ మతోన్మాద లాయర్ దాడి చేయడం సమంజసం కాదని అన్నారు. ఈ రకమైన దాడితో భారత సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ దాడికి పాల్పడిన మతోన్మాద న్యాయవాదిని తక్షణమే బార్‌కౌన్సిల్ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, సిహెచ్ వెంకటేష్, ఎ.జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిజెఐపై దాడి రాజ్యాంగాన్ని అవమానించడమే

శృంగవరపుకోట : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌పై దాడి రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు అన్నారు. సిజెఐపై దాడిని వ్యతిరేకిస్తూ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ దాడికి పాల్పడిన న్యాయవాది కిశోర్‌ని శిక్షించడంతోపాటు ఆయన్ను ఈ ఘటన ప్రేరేపించిన భావజాలాన్ని నిర్మూలించే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిహెచ్ ముత్యాలు, దళిత సంఘ నాయకులు కడారి జయశంకర్, జి.సన్యాసిరావు, పోకల భాస్కర్, ఎస్.సూరి, బిసు తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోటలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, తదితరులు

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

- లక్ష్యం 4.5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఈనెల 30లోగా బ్యాంకు గ్యారంటీలు పూర్తి కావాలి
- తేమ యంత్రాలు, గోనె సంచులు సిద్ధం చేసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశం


అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ ఖరీఫ్‌కు గానూ 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి సేకరణ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయి కమిటీలను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ వారు పంట రకం, దిగుబడి వచ్చే సమయం, సేకరణ పై మండల స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని, మద్దతు ధర , ట్రక్ షీట్ విధానం , తదితర అంశాల పై విస్తతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఆర్ఎస్‌కెలతో మాపింగ్, రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. పౌర సరఫరాల అధికారి మిల్లులను ట్యాగ్ చేయడం, బ్యాంకు గ్యారంటీ లను తీసుకోవడం, అన్ని మిల్లుల పని చేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయడం , సిఎస్‌డిటి లకు శిక్షణ వంటి కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. వర్షాలు పడితే టార్పాలిన్ సరఫరా చేయడానికి మండల కేంద్రాల్లో సిద్ధం చేయాలని మార్కెటింగ్ ఎడికి సూచించారు. ప్రాధమిక సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేయడానికి 57 సొసైటీలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. వాహనాలకు జి.పి.ఎస్ ఏర్పాటు, తూకపు యంత్రాలను ఏర్పాటు, హమలీలను గుర్తించడం ఆయా శాఖలు వెంటనే చేయాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమగు షెడ్యూల్ వేసుకొని, అన్ని పనులను అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలనీ సూచించారు. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ మాట్లాడుతూ గత ఏడాది సేకరణ లో తలెత్తిన సమస్యలపై వివరించారు. గత ఏడాది జిల్లాలో 159 మిల్లులు పని చేసాయని, ఈ ఏడాది 158 మాత్రమే పని చేస్తున్నాయని తెలిపారు. ఆర్ఎస్‌కెలను వాటి పరిధి లో వచ్చే పంటను బట్టి ఎ,బి,సిలుగా గుర్తించామన్నారు. సమావేశం లో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ బొడ్డేపల్లి శాంతి, ఆర్‌డిఒలు కీర్తి, రామ్మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి భారతి, జిల్లా సహకార అధికారి రమేష్, ఎడి మార్కెటింగ్ రవి కిరణ్ , మిల్లర్ల , రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎవరో వస్తారని ఏదో చేస్తారని..

ప్రజాశక్తి-వేపాడ

ఎవరో వస్తారని ఏదో చేస్తారని
ఎదురు చూసి మోసపోకుమా
నిజము మరచి నిదురపోకుమా

మహాకవి శ్రీశ్రీ రాసిన గీతాల్లో ఇదొకటి. ప్రబోధాత్మక గీతమిది. ఐదు దశాబ్దాల క్రితం ఆ మహాకవి రచించిన ఈ గీతంలో చెప్పిన ఉపాధ్యాయుల పరిస్థితుల్లో ఇప్పుడు కొంతమార్పు వచ్చిందేమో గానీ, విద్యావ్యవస్థలో మార్పు మాత్రం కనబడలేదు. గిరిజన గ్రామాల్లోని పరిస్థితుల్లో అప్పటికీ, ఇప్పటికీ చెప్పుకోదగ్గ మార్పు కానరాలేదు. అందుకే విసిగి వేసారిన గిరిజనులు ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ పిల్లల భవిష్యత్తును చక్కదిద్దాలని భావించారు. భావితరాలకు చక్కని విద్యనందించేందుకు మార్గం చూపించారు.


విద్యార్థుల కోసం పాక ఏర్పాటుచేస్తున్న గిరిజనులు

వేపాడ మండలం కరకవలస పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం.. మారిక. ఈ గిరిశిఖర గ్రామంలోని గిరిజన చిన్నారులు చదువుకునేందుకు ఏళ్ల తరబడి మొరపెట్టుకున్నా పాఠశాల భవనం నిర్మించడం లేదు. భవనానికి నిధులు మంజూరైనా నిర్మించడం లేదు. దీంతో చెట్టు కిందే బోధన సాగించాల్సిన దుస్థితి నెలకొంది. గత, ప్రస్తుత పాలకులు వీరిని ఓటర్లుగానే చూశారు తప్ప వెనుకబాటు తనాన్ని పారదోలేందుకు, వారిని అభివృద్ధి పథాన నడిపేందుకు కనీస చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం గిరిజనుల పట్ల చూపుతున్న వివక్షత వల్ల గిరిజన చిన్నారులు చదువుకు దూరమవుతున్నారు. ఇటీవల ఉపాధ్యాయులు తాడి రాంబాబు విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యం చేశారు. ఇరువురు ఉపాధ్యాయులు కష్టపడి పిల్లలను తీర్చిదిద్దుతామని, మీరంతా సహకరించి కనీసం విద్యార్థులు కూర్చొనేందుకు, చదువు చెప్పేందుకు పాక వేయాలని కోరారు. దీంతో గిరిజనులంతా పూనుకుని కర్రలతో పాకవేశారు. ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోక పోవడంతో పాకలో తమ పిల్లలు కనీసం ప్రశాంతంగా కూర్చుని చదువుకుంటారని భావిస్తున్నామని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాల భవనం నిర్మించాలని కోరుతున్నారు.

మెనూ అమలు చేయకుంటే చర్యలు

ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో జిఒ 8 ప్రకారం మెనూ అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన పర్యటించారు. టిఆర్ కాలనీలో మున్సిపల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించారు. అన్నం అట్టెసరు పద్ధతిలో వండకుండా, గంజి వార్చే విధానంలో వంట చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తోందని, పోషకాలు గంజితో బయటకు పోయే విధానంలో వంట చేయవద్దని సూచించారు. రేషన్ షాపు, కెజిబివి, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఎస్ డిటి సాయికృష్ణ, ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కాలం చెల్లిన కందిపప్పు వాడకంపై ఆగ్రహం

రామభద్రపురం : ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ మేరకు శుచిగా భోజన పథకాన్ని అమలు పరచాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలం చెల్లిన కందిపప్పు వాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా వాడితే ఫుడ్ పాయిజన్ జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. దీనిపై పౌరసరఫరాల అధికారిని వివరణ కోరారు. కాలం చెల్లిన 8 ప్యాకెట్ల కందిపప్పును స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఐసిడిఎస్ పిఒ వరాలమ్మను ఆదేశించారు. బూసాయవలస కెజిబివిని పరిశీలించారు. ఉదయం మెనూలో ఉప్మా కాకుండా వేరే అల్పాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ తిరుమల ప్రసాద్ పాల్గొన్నారు.

6ఎ కేసు నమోదు

కంటోన్మెంట్ : పూల్‌బాగ్ కాలనీలోని రేషన్ షాపును ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. షాప్‌లో ఉండవలసిన బియ్యం నిల్వల కంటే సుమారు 50 బ్యాగులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో షాప్ డీలరుపై 6ఎ కేసు నమోదు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా ఇన్‌ఛార్జి పౌర సరఫరాల అధికారి జి. మురళినాథ్, ఐసిడిఎస్, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ ఇన్స్పెక్టర్, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అర్జీదారులపట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన ఐవిఆర్ఎస్ కాల్స్ డేటాపై సమీక్షించారు. మ్యుటేషన్లకు సంబంధించి ఎక్కువగా అర్జీలు పెండింగ్‌లో ఉంటున్నాయని, దీనిపైనే ప్రధానంగా ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతోందని చెప్పారు. పరిష్కారం అయ్యే సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం చేయలేనివాటికి సంబంధించి, అర్జీదారులకు ప్రభుత్వ నిబంధనలను వివరించాలని, ఏ కారణాలవల్ల వారి సమస్య పరిష్కారం కావడంలేదో సమగ్రంగా తెలియజేయాలని చెప్పారు. అర్జీదారులకు సమగ్ర వివరాలతో నోటీసు అందించి, వారి సంతకం తీసుకోవాలని అన్నారు. సమావేశంలో కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి మురళి, సర్వేశాఖ ఇన్‌ఛార్జి ఎడి యజ్ఞేశ్వర్రావు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ , మాదకద్రవ్య నిరోధక చట్టంపై ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో 1997లో ఏర్పాటుచేసిన ర్యాగింగ్ నిరోధక చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా విద్యాసంస్థ లోపల లేదా వెలుపల ప్రత్యక్షంగా గాని లేదా పరోక్షంగా గాని ర్యాగింగ్‌కు పాల్పడినా, పాల్గొన్నా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. దోషిగా తేలిన విద్యార్థిని కాలేజీ నుంచి డిస్మిస్ చేసే అవకాశం తో పాటు మరి ఏ ఇతర కాలేజీలో జాయిన్ అవ్వకుండా చట్టం ఉందని తెలిపారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు, లేదా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కోర్టు కోర్టుకు ప్రత్యక్షంగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఇంజనీరింగ్, మెడికల్ విద్యాసంస్థల్లో ర్యాగింగ్ కమిటీ, స్క్వాడ్‌లు ఉండాలని సూచించారు. సదస్సులో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవి మాధవి, డాక్టర్ బి.సుదర్శి జూనియర్ డాక్టర్ ఆదిత్య పాల్గొన్నారు.

చిచ్చు పెట్టడానికే జగన్ పర్యటన : ఎమ్‌పి

ప్రజాశక్తి -విజయనగరం కోట

ఉత్తరాంధ్రలో చిచ్చు పెట్టడానికే వైసిపి నాయకులు జగన్మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నారని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత 15 నెలలుగా ఉత్తరాంధ్ర ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు ఉన్నారన్నారు. అటువంటి ఉత్తరాంధ్రలో చిచ్చు పెట్టడానికే జగన్ పర్యటిస్తున్నారని అన్నారు. ఈ పర్యటనతో ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. వైసిపి హయాంలో విధ్వంసం జరిగిన అమరావతి, పోలవరం జగన్ సందర్శించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలను పూర్తిచేయకపోగా ఇప్పుడు పరిశీలన చేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి నాయకులు బొద్దల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.80 కోట్లతో పైడితల్లమ్మ ఆలయ అభివృద్ధి

పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఆలయ ధర్మకర్త అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.కోటి, 80 లక్షల సిడిఎఫ్ నిధులతో చేపట్టనున్న పునర్ నిర్మాణ పనులకు ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు గురు వారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్‌సి గాదె శ్రీనివాసుల నాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఆలయ ఇఒ కె.శిరీష పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఆలయ ధర్మకర్త అశోక్ గజపతిరాజు

ఏడాదిలో పనులు పూర్తిచేస్తాం

అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణ పనులను ఏడాదిలోపల పూర్తి చేస్తామని అశోక్‌గజపతిరాజు చెప్పారు. వచ్చే ఏడాది పండుగ నాటికి భక్తులకు ఇబ్బందులు తొలగిపోతాయని, వారు సంతోషించేలా పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. తమతోపాటు ఇటీవలే ఏర్పాటైన ఆలయ కమిటీ కూడా ఈ పనులను పర్యవేక్షించి, సకాలంలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నది ఎప్పటినుంచో తమకు ఉన్న ఆశయమని, అది ఇన్నాళ్లకు నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. పైడితల్లి అమ్మవారి కీర్తిని, ప్రతిష్టను మరింత పెంచేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఎంఎల్ఏ అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ చట్టప్రకారం ఆలయం చుట్టూ భూసేకరణ పూర్తయ్యిందని అన్నారు. ఆలయ విస్తరణ వల్ల అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని ఆమె చెప్పారు.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు

ఈనెల 14న నిర్వహించనున్న పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవానికి అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలను నగర పాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. గురువారం కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, సిబ్బంది వనం గుడి ప్రాంతం గాడీఖానా సమీపంలో ఉన్న పెద్ద చెరువు గట్టు పరిసర ప్రాంతాల్ని శుభ్రపరచే కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు కలెక్టరేట్ ఆవరణలో నీరు తొలగింపు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కలెక్టరేట్ అవరణలో క్యాంటీన్‌కు వెళ్లే తోవలో వర్షం పడితే నీరు నిల్వ ఉన్న పరిస్థితి ఉండేది. మోకాలి లోతున నీరు చేరేది. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో జిల్లా అధికారులు నిర్మాణ పనులకు ప్రతిపాదనలు తయారు చేశారు. కలెక్టరేట్ లోపల నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నీటిని మున్సిపల్ అధికారులు బయటకు పంపించాలని ప్రయత్నించినా ఫలించలేదు. ఈ నేపథ్యంలో రహదారుల శాఖ అధికారులు గురువారం నిల్వ ఉన్న నీటిని బయటకు పంపి పొక్లైనర్‌తో చదువును చేశారు. రహదారి నిర్మించేందుకు కొలతలు వేశారు.

కన్నకొడుకే కాలయముడై

మద్యం మత్తులో తండ్రిని చంపిన కొడుకు

ప్రజాశక్తి-బాడంగి


మృతిచెందిన రాజేశ్వరరావు

మద్యం మత్తులో తండ్రిని హత్య చేశాడో ఉన్మాది. ఈ సంఘటన బాడంగి మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాడంగిలోని సినిమా కాలనీలో బోనగిరి రాజేశ్వరరావు(71) కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఆయనకు భార్య ఉమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి సొంతూరు బలిజిపేట. బతుకుతెరువు కోసం బాడంగిలో నివాసముంటున్నారు. చెప్పులు కుట్టుకుంటూ రాజేశ్వరరావు సాగిస్తున్నాడు. ఈయన చిన్న కొడుకు లక్ష్మణరావు మద్యం సేవిస్తూ తిరుగుతుండటంతో బుధవారం రాత్రి తండ్రి మందలించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. సుత్తి లాంటి వస్తువుతో లక్ష్మణరావు కొట్టటంతో రాజేశ్వరరావు అక్కడికక్కడే మరణించాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. నిందితుడు లక్ష్మణరావును అదుపులో తీసుకొన్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

కాలువలపై నివేదిక ఇవ్వండి

ఎమినిటీస్ కార్యదర్శులతో కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో వర్షపు నీరు, మురికి నీటి ప్రవాహానికి అవసరమైన కాలువల పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి నివేదికలను సిద్ధం చేయాలని ఎమినిటీస్ కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశానుసారం మూడు ప్రధాన అంశాలను పరిగణలోకి తీసుకొని కాలువల విస్తీర్ణానికి తగు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. తొలి ప్రధాన్యతాంశంగా అత్యవసరమైన నీటి ప్రవాహానికి అవసరమైన కాలువల ఏర్పాటును గుర్తించాలన్నారు. రెండో ప్రాధాన్యతాంశం గా మురికివాడలు, జన సమ్మర్థం ఎక్కువగా ఉన్న నివాసాల ప్రాంతాలలో కాలువల అవసరాన్ని గుర్తించాలన్నారు.

మూడవ ప్రాధాన్యత అంశంగా శివారు ప్రాంతాలు, విలీన ప్రాంతాలలో అవసరమైన కాలువల గురించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. రానున్న రోజుల్లో వర్షపు నీటి నిలువకు గాని, మురికినీరు రహదారులపై ప్రవహించడానికి వీలు లేకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టబోతుందన్నారు. సమావేశంలో ఇఇ ప్రసాద్, డిఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు బాక్సింగ్, తైక్వాండో జట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 10 నుండి 12 వరకు పశ్చిమగోదావరి జిల్లా రాజమండ్రిలో జరుగనున్న అండర్ 14 ,17 బాక్సింగ్ పోటీలకు విజయనగరం జిల్లా బాక్సింగ్ జట్టు, బాపట్ల జిల్లా రేపల్లెలో జరగబోయే అండర్ 14 టైక్వాండో పోటీలకు కూడా జిల్లా జట్లు బయలుదేరి గురువారం వెళ్లాయి. ఇరు జట్లు రాష్ట్ర పోటీల్లో విజేతలుగా నిలవాలని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి ఆకాంక్షించారు. బాక్సింగ్ పోటీలకు అండర్ 14 విభాగంలో దుప్పాడ క్లబ్‌కు చెందిన కె నరేంద్ర, అండర్ 17 విభాగంలో మహిళలు కె.అక్షయ, జాన్సీ, ఎన్.బాబి, పి.గోవర్ధన్, ఎస్.శశాంక్ నాయుడు ఎంపికయ్యారు.

జిఎస్‌టితో వైద్య రంగంలో సానుకూల మార్పులు

జిఎస్‌టి జెసి నిర్మలా జ్యోతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిఎస్‌టితో వైద్య రంగంలో సానుకూల మార్పులు జరుగుతున్నాయని, ముఖ్యంగా పాలసీలపై 18శాతం జి ఎస్‌టి 0 శాతానికి తగ్గటంతో సాధారణ ప్రజలకు గణనీయమైన మేలు జరుగుతుందని జి ఎస్ టి జాయింట్ కమిషనర్ నిర్మలా జ్యోతి పేర్కొన్నారు. సూపర్ జి ఎస్ టి - సూపర్ సేవింగ్ ప్రచారం లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఆరోగ్య రంగానికి కలిగిన ప్రయోజనాలను వివరించే కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, వైద్య సిబ్బంది ప్రజలకు జిఎస్‌టి సదుపాయాల వల్ల వైద్యరంగంలో వస్తున్న సానుకూల మార్పులను వివరించారు. తక్కువ ప్రీమియంతోనే ఆరోగ్య బీమా పాలసీలు పొందే అవకాశం లభించనుందని తెలిపారు.

ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనంతపురంలో ఈ నెల 13, 14, 15తేదీల్లో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బిజి నగర్‌లో గురువారం ఐద్వా జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. రమణమ్మ జెండా ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లడుతూ ఐద్వా నిరంతరం మహిళలు సమస్యలపై పోరాడుతు న్నదని, నేడు మహిళలపై మద్యం, డ్రగ్స్,వలన అనేక హత్యలు, అత్యా చారాలు జరుగుతున్నాయని అన్నారు. మద్యం విక్రయాలతో అనేక కుటుంబాలు నాశనం అవుతున్నాయని అన్నారు. రాబోయే కాలంలో మద్యం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఈ మహాసభల్లో పోరాట కార్యక్రమం రూపందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు పుణ్యవతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి రమణమ్మ

వ్యాధుల పట్ల అప్రమత్తం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వర్షాకాలంలో నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా కలుషిత నీటివల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున నీరు మరిగించి తాగడం, భోజనం ముందు చేతులు కడగడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం వంటి చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నగర వ్యాప్తంగా నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. ఎవరైనా వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు గమనించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గర్భాం 132 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నట్లు ఇఇ బి.రఘు తెలిపారు. దీంతో గజపతినగరం, జిన్నాం సబ్‌స్టేషన్ పరిధిలో గంగచోళ్లపెంట, పట్రువాడ, కొత్తబగ్గాం, పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బుడిపేట, కొనిస, మద్రివలస, సాలిపేట, ఎంజిఆర్ పురం, శ్రీరంగరాజపురం, లింగాలవలస, లోగిస, రంగుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెల్లిమర్ల మండలంలో

నెల్లిమర్ల : నెల్లిమర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు తెలిపారు. నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి విస్తరణ పనులు, వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగిస్తున్నందున నెల్లిమర్ల సబ్ స్టేషన్ నుంచి గుర్ల రూరల్ ఫీడర్ పరిధిలో నెల్లిమర్ల మండలంతో పాటు మొయిద నారాయణపట్నం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట, చింతలపేట, పెద మజ్జిపేట, 11కెవి వాటర్ వర్క్స్ పరిధిలో జరజాపుపేట పంప్ హౌస్, సాయి సుభద్ర థియేటర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదార్లు సహకరించాలని కోరారు.

పత్ర కషాయంతో చీడ పురుగుల నివారణ

ప్రజాశక్తి - గజపతినగరం

పలుపత్ర కషాయంతో చీడ పురుగులను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం డిపిఎం ఆనందరావు తెలిపారు. గురువారం మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, బాలి రామునాయుడు పొలాల్లో పలుపత్ర కషాయం, ఇంగువ ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో పిచికారీ చేశారు. సర్పంచ్ ఈశ్వరరావు కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో గత కొంతకాలంగా అధిక లాభాలు లభిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.



ఎపిఎంకు వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

విఒఎలకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విఒఎలకు కనీస వేతనాలు చెల్లించాలని గ్రామైక్య సంఘాల సహాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు వెలుగు ఎపిఎం సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని, గతంలో కంటే ఆన్లైన్ సేవలు పెరిగినందున 5జి మొబైల్ ఫోన్లు, సిమ్స్ తమకు అందజేయాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఉద్యోగాలు తొలగించవద్దని కోరారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల సమాఖ్య అధ్యక్షురాలు మనూజ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ

ప్రజాశక్తి - దత్తిరాజేరు

పంట కోత ప్రయోగంపై గ్రామ వ్యవసాయ సహాయకులకు, రెవెన్యూ అధికారులకు మండల రైతు సేవా కేంద్రంలో గురువారం ఎఒ అనురాధ, ఎఎస్ఒ జగన్నాథం శిక్షణ ఇచ్చారు. పంట కోత ప్రయోగంలో తప్పిదాలు జరగకుండా దిగిబడి అంచనా కట్టాలన్నారు. కార్యక్రమంలో బీమా జిల్లా కోఆర్డినేటర్ గోపిరాజు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సీమంతాలు

ప్రజాశక్తి-వేపాడ

బొద్దాం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ఐసిడిఎస్ ఆధ్వర్యాన గురువారం సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ఆహార అలవాట్లు, తల్లిపాల ప్రాముఖ్యతపై సూపర్‌వైజర్ అరుణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె.సరస్వతి, జి.ఉమామహేశ్వరి, కె.సరస్వతి, ఎస్‌కె అమ్మాజీ, ఎఎన్ఎం ఎరుకులమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ విజయవంతం

ప్రజాశక్తి - పూసపాటిరేగ



ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులు

వంగర మండల కేంద్రంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు వృత్తి విద్యా శిక్షణలో భాగంగా ఆటోమోటివ్ ట్రేడ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశారని పాఠశాల హెచ్‌ఎం సౌభాగ్య లక్ష్మి తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు ఉపాధి అవకాశాలు, వృత్తి నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై అవగాహన పొందారన్నారు. 'ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉపాధి మార్గాలను గుర్తించడంలో, వృత్తి పరిజ్ఞానం పెంపొందించుకోవడంలో మేలైన అనుభవాన్ని సొంతం చేసుకున్నారని' అన్నారు. శిక్షకుడు దామోదర్, మదీనా బైక్ మెకానిక్ వర్క్‌షాప్ యజమాని మదీనా పర్యవేక్షణలో ఇంటర్న్‌షిప్ విజయవంతంగా సాగిందని తెలిపారు.



విద్యార్థి చరణ్‌కు బహుమతి అందజేస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

అభ్యుదయ విద్యార్థి చరణ్‌కు బహుమతి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో అభ్యుదయ పాఠశాల విద్యార్థి కంట చరణ్ బాలాజీ సత్తాచాటాడు. పట్టణంలోని రాజా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భూకంపాలు సంభవించే ముందు ప్రజలను హెచ్చరించడంపై చరణ్ ఏర్పాటుచేసిన ప్రాజెక్టు ఆకట్టుకుంది. దీంతో రెండో బహుమతి లభించింది. ఇస్రో శాస్త్రవేత్తలు చరణ్‌కు బహుమతి అందజేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి

ప్రజాశక్తి- రేగిడి



రేగిడి : సర్పంచులు, కార్యదర్శుల శిక్షణలో మాట్లాడతుఉన్న ఎంపిడిఒ శ్యామల కుమారి

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ శ్యామల కుమారి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణలో భాగంగా మండల లెవెల్ ఓన్ సోర్స్ రెవెన్యూ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆర్థిక బలోపేతానికి ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో సొంత వనరులను పెంపొందించాలన్నారు.రిసోర్స్ పర్సన్స్ శ్యామ్, హేమ సుందర్‌రావు, గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి శిక్షణకు సర్పంచులు గైర్హాజరు

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా గురువారం నిర్వహించిన మండల స్థాయి సర్పంచుల, పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో భాగంగా సర్పంచులు గైర్హాజర్‌తో కార్యదర్శిలతోనే శిక్షణ కొనసాగించారు. 39 గ్రామపంచాయతీల సర్పంచులకు గాను కొర్లవలస, రేగిడి, ఉంగరాడ, ఆర్ ఆముదాలవలస, అప్పాపురం, తునివాడ, గుల్లపాడు, కోడిస, దేవుదల గ్రామ పంచాయితీ సర్పంచులు మాత్రమే హాజరయ్యారు.

వంగర: గ్రామ పంచాయతీలలోనే ఆర్థిక వనరులు చేకూర్చుకొని పంచాయతీలను అభివృద్ధి చేయాలని ఎంపిడిఒ టి.రాజారావు అన్నారు. పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపిడిఒ కెల్ల రామారావు, ఎంఒటి మాస్టర్ ఆఫ్ ట్రైన్ సుధీర్ గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సొంత ఆదాయ వనరుల పెంపుతో గ్రామ పంచాయతీల అభివృద్ధి జరుగుతుందని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గ్రామపంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదాయ వనరులు పెంచుకునే అంశాలను రిసోర్స్ పర్సన్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శంకర్ జగన్నాథ్, కార్యాలయ ఎఒ సుదర్శనం పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి - గజపతినగరం



గజపతినగరం : ఏరియా ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ జగదీష్

గజపతినగరంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బెల్లాన ఆసుపత్రిలో జిఎస్‌టిపై అవగాహన కార్యక్రమాలను గురువారం ఎంపిడిఒ కళ్యాణి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపు వల్ల ప్రజలకు ఆదాతోపాటు ఆరోగ్యానికి ఊరట కలుగుతుందన్నారు. ఎంపిడిఒ బి.కళ్యాణి మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో తప్పనిసరిగా తగ్గిన జిఎస్‌టి స్లాబ్‌లను అమలు చేసి, నూతన ధరల ప్రకారంగా అమ్మకాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లాన ఆసుపత్రి ఎమ్‌డి లక్ష్మీ నరేన్, ఇఒపిఆర్‌డి జనార్ధన్‌రావు, ఎఎన్ఎంలు, ఆరోగ్య మిత్రలు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపిటిసి పిల్లా లక్ష్మి మాట్లాడుతూ వైద్య పరికరాలు, మందులపై జిఎస్‌టి తగ్గింపుతో రేట్లు బాగా తగ్గాయని, ఆరోగ్య బీమా కూడా ఆదా కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, గ్రామ పెద్దలు ఎర్ర సన్యాసిరావు, జె.మంగునాయుడు పాల్గొన్నారు.



వేపాడ : జిఎస్‌టిపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది, గ్రామ పెద్దలు

జిఎస్‌టి తగ్గింపుతో వైద్య రంగానికి మేలు

నెల్లిమర్ల : జిఎస్‌టి తగ్గింపుతో జీవిత బీమా, వైద్య రంగానికి మేలు కలిగిందని సామాజిక ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం. తిరుమల దేవి తెలిపారు. గురువారం ఆమె స్థానిక సామాజిక ఆసుపత్రిలో జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వస్తు సేవా పన్ను తగ్గించడం వల్ల మందులు, జీవిత బీమా పాలసీ రేట్లు తగ్గినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల చోరీతో గద్దెనెక్కిన ఎన్‌డిఎ

డిసిసి అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి-బొబ్బిలి



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓట్ల చోరీ ద్వారానే ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ ఆరోపించారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన గురువారం బొబ్బిలి పట్టణంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ ప్రజల ఓట్లను దోచుకుని మూడోసారి గద్దెనెక్కిందన్నారు. ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలకు పాల్పడి లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించి, ఉన్న ఓట్లను తొలగించి ఓట్ చోరీకి పాల్పడిందని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడిందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మువ్వల శ్రీనివాసరావు, కె.కె.రామారావు, గొల్లపల్లి రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఓట్ చోర్ గద్దె చోడ్' పై సంతకాల సేకరణ

నెల్లిమర్ల : ఓట్ చోర్ గద్దె చోడ్ పై కాంగ్రెస్ పార్టీ గురువారం జరజాపుపేటలో సంతకాలు సేకరణ చేపట్టింది. ఆ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి తెలుగు సూరిబాబు ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో బిజెపి ఓట్లు దొంగిలించి మూడవసారి గద్దెనెక్కిందని ఆరోపించారు. ఈ మోసాలను ప్రజలకు తెలియ పర్చడానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓట్ చోర్ గద్దె చోడ్ అనే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనకల పద్మనాభం, పూసపాటి రేగ మండల అధ్యక్షులు చిలక రాజు, భవాని, కనకల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్ బాబు అన్నారు. పట్టణంలోని సింగారపువీధిలో సిసి కాలువ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాల కల్పనకు పని చేస్తున్నామని చెప్పారు. అన్ని వార్డుల్లో రోడ్లు, కాలువలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్ ఎస్.లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం

స్వచ్ఛ మున్సిపాలిటీగా ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అవార్డు తీసుకున్న మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్ బాబు, కమిషనర్ ఎల్.రామలక్ష్మిని కోటలో గురువారం ఎమ్మెల్యే బేబినాయన సత్కరించి అభినందించారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని బేబినాయన కోరారు.



కమషనర్, మున్సిపల్ ఛైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని గొట్లాం గ్రామంలో వరి పంట పొలాలను విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కెల్ల లక్ష్మణ్, శ్రీనివాస్ పరిశీలించారు. ప్రస్తుతం ఎంటియు-1121 రకంపై పాముపొడ, గోధుమ రంగుమచ్చ, ఆకుముడత తెగుళ్లు ఉన్నట్లు వారు గుర్తించారు. పటాస్ లోపం కూడా ఉండటంతో నివారణ నిమిత్తం రైతులకు నివారణ చర్యలపై పలు సూచనలు చేశారు. చిరు పొట్టదశలో తప్పనిసరిగా యూరియా, పొటాష్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి నిర్మల్ జ్యోతి, ఎఒ మల్లికార్జునరావు, ఎఇఒలు సంతోష్, సాయిబిందు పాల్గొన్నారు.



మృతి చెందిన అప్పయ్యమ్మ

గోడ కూలి ఒకరు మృతి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని గొల్లవీధి జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న భవనం గోడ కూలి ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. నాసిరకంగా గోడ నిర్మించడంతో గురువారం పనులు చేస్తుండగా గోడ కూలింది. అక్కడే పని చేస్తున్న గొల్లవీధికి చెందిన భవన నిర్మాణ కార్మికురాలు బోనంగి అప్పయమ్మ (60) మృతి చెందింది. పిరిడి గ్రామానికి చెందిన రామినాయుడు, పినపెంకి గ్రామానికి చెందిన రామలక్ష్మి గాయపడ్డారు. సంఘటన స్థలానికి పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చేరుకుని కేసు నమోదు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి సంపర్తి ఆంజనేయులు గురువారం మృతిచెందాడు. రజక సామాజిక తరగతికి చెందిన ఆంజనేయులు దుస్తులు ఉతికేందుకు తుమ్మ చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ చెరువులో కాలుజారిపడి మరణించాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వల్లంపూడి స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శివ, కానిస్టేబుల్ వెళ్లి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భార్యతో గొడవ

రైలు కింద పడిన వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని పోతనపల్లికి చెందిన పొట్నూరు గణేష్ భార్యతో గొడవపడి మద్యం మత్తులో గురువారం తెల్లవారుజామున పట్టణంలోని రైల్వేగేట్ వద్ద రైలుకింద పడ్డాడు. ఆయన ఎడమకాలిపై నుంచి రైలు వెళ్లిపోవడంతో నుజ్జునుజ్జయింది. స్థానికులు గుర్తించి ట్రాక్ బయటకు తీసి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. రైల్వే పోలీసులు హుటాహుటిన విశాఖ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆయన ఎడమ కాలు పూర్తిగా తొలగించారు. గణేష్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాలు

సిజెఐపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - వంగర

అంబేద్కర్ విగ్రహాలపై దాడులు అరికట్టి, నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడికి పాల్పడిన రాజేష్ కిషోర్ పై రాజ ద్రోహం కేసు నమోదు చేయాలని దళిత బహుజన సంఘాల జెఎసి నాయకుడు ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనోటరింగ్ కమిటీ సభ్యుడు మజ్జి గణపతి డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకొని గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పై జరిగిన దాడిని, అంబేద్కర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన జెఎసి నాయకులు యమ్.గణపతిరావు, రాజు, అప్పన్న, చిన్న సింహాచలం, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్ పై దాడి అమానుషం

గరివిడి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బూటుతో దాడి చేయడం అమానుషమని సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. సిపిఎం నాయకులు ఎ గౌరినాయుడు, జె.విశ్వనాదరాజు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ మీద జరిగిన దాడి రాజ్యాంగం మీద జరిగిన దాడిగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవస్థను కాపాడి, రాజ్యాంగాన్ని పరిరక్షించి దాడి చేసిన ఉన్మాదులని కఠినంగా శిక్షించాలని కోరారు. సన్యాసినాయుడు, సేనపతి రమణ, బోరు సత్యం తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలస గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త నందినికి మెరుగైన వైద్యం అందించేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు ఒక్కటై మానవత్వానికి నిదర్శనంగా ముందుకు వచ్చారు. ఆమెకు ఆర్థిక సహాయంగా రూ.50వేలు చెక్కును గురువారం అందజేశారు. నందిని గతంలో జనసేన వాలంటీర్‌గా పనిచేసి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. ఇటీవల అనారోగ్యానికి గురై స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ, తగిన వైద్యం అందకపోవడంతో ఆమె పరిస్థితి ఆందోళన కలిగించింది. ఈ విషయం తెలుసుకున్న జనసేన మండల కోఆర్డినేటర్ గుడివాడ జమరాజు, పార్టీ కార్యకర్తలు అందరూ కలిసి సహాయ హస్తం అందించారు. కష్టకాలంలో తమ కార్యకర్తలకు అండగా నిలబడటం తమ బాధ్యత అని అన్నారు. నందినికి మెరుగైన వైద్యం అందే వరకు తామంతా అండగా ఉంటామని జమరాజు తెలిపారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాల మేరకు ఈ సహాయం అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల అప్పలరాజు, కోట్ల రఘు, పతివాడ శ్రీను, ఎంపిసి ఉపాధ్యక్షులు బాసిదుర్గ, రౌతు ఉపేంద్ర, నక్కన రమణ, కె.శ్రావణ్ కుమార్, జి.గౌతమ్ రెడ్డి, వి.కిరణ్, ఎం.శ్రీను, ఎస్.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర యాప్‌ల బహిష్కరణ

ప్రజాశక్తి - వంగర

ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి బోధ నేతర యాప్స్ బహిష్కరణ చేస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు వెల్లడించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి మీసాల కూర్మినాయుడుకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు బలగా ప్రసాద్, వెంకీ, గౌరీ శంకర్ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులను బోధనకే పరిమితి చేయాలని పలుమార్లు ప్రభుత్వ పెద్దలు, అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినప్పటికీ మరిన్ని యాప్స్ పెరుగుతున్న కారణంగా ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారన్నారు. దీని వల్ల విద్యార్థులకు సరైన విద్యను అందించలేని పరిస్థితి నెలకొందని తద్వారా పిల్లలు ప్రభుత్వ బడికి దూరం అయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ నెల 10 నుండి ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కావాలని, బోధనేతర పనులు అయిన విద్యాశక్తి, జిఎస్టి 2.0 వంటి సీజనల్ ప్రచారం, గూగుల్ షీట్స్ నింపడం, గ్రీన్ పాస్పోర్టు వంటి వాటిని బహిష్కరించి, కేవలం ఉపాధ్యాయుల,విద్యార్థుల హాజరు, ఎండిఎం నిర్వహణ, పరీక్షల నిర్వహణ మాత్రమే చేయాలని ఫ్యాప్టో సంఘాల పిలుపు మేరకు వంగర ఫ్యాప్టో సంఘాల నాయకులు ఎంఇఒకు యాప్స్ బహిష్కరణ నోటీసు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బి.శ్రీనివాసరావు, వై.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్‌టి సెల్ ఛైర్మన్‌గా మురళి

ప్రజాశక్తి-విజయనగరంకోట

కాంగ్రెస్ ఎస్‌టి సెల్ జిల్లా ఛైర్మన్‌గా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన దేసరి మురళీని నియమిస్తూ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా, ఎస్‌టిసెల్ ఛైర్మన్ నవభరత్ ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ చేతుల మీదుగా ఎస్‌టి సెల్ ఛైర్మన్ గా నియామక పత్రతాన్ని మురళికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి శ్రీనివాసరావు , ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు సుంకర గణేష్ పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక సువర్ణముఖి నదిపై ఉన్న వంతెనపై గురువారం ఇరువైపుల నుండి ఒకేసారి వాహనాలు రాకపోకలు రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వంతెనపై భారీ వాహనాలు రావడంతో ఎదురుగా వచ్చిన వాహనాలు తప్పించుకోలేక అక్కడ ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. దీంతో పోలీసుల సహకారంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

వల్లంపూడి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం, ఐఎస్ఎల్, పాఠశాల ఆవరణను పరిశీలించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

నా క్లయింట్ బండారు గణేష్, తండ్రి అప్పలరాజు, డోర్ నెంబర్-0-0, కొత్తవలస పంచాయతీ బలిఘట్టం గ్రామం, విజయనగరం జిల్లా నివాసి. నా క్లయింట్ కొత్తవలస సబ్ రిజిస్టర్ పరిధి, బలిఘట్టం రెవెన్యూ సర్వే నెంబర్: 124-1లో చేరినటువంటి 0-02 సెంట్లు స్థలం దస్తావేజు నెంబర్-65/1985 ద్వారా పడిన ఆస్తి తాలూకా ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్లు, మరియు మరికొన్ని జిరాక్స్ డాక్యుమెంట్స్ ఈ నెల సెప్టెంబర్ 15వ తేదీన బలిఘట్టం గ్రామం నుంచి కొత్తవలస జంక్షన్‌కు బైక్ మీద వస్తున్న సమయంలో మార్గమధ్యలో పడిపోయింది. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియజేసి తిరిగి ఇవ్వవలసిందిగా కోరుచున్నాను.

కుప్పిలి మురళీధర్, అడ్వకేట్, విశాఖపట్నం
సెల్ : 98493 92477

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టువారి దివ్య సముఖమునకు
SOP 5/2025

Between :
మజ్జి పద్మావతి ....పిటిషనరు
And :
1) సామంతుల మోనిక
2) మజ్జి సత్యంనాయుడు
3) మజ్జి లోకేష్ ......రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

ఇందుమూలంగా పై పిటిషనరు రాజాం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో SOP 5/25 దాఖలు చేసియున్నారు. పై తెలిపిన పిటిషనరు కుమారుడు మజ్జి జగన్‌మోహన్ రావు తే 31-8-2025దీ మరణించినారు. ఆ కారణంగా సదరు మజ్జి జగన్‌మోహనరావు యొక్క (P.F) ప్రవిడెంట్ ఫండ్ అకౌంటులో 2,64,316/- రూపాయలు డబ్బులు కొరకు సంప్రదించగా అందులకు వారు వారసత్వపు సర్టిఫికేటు తీసుకోని రమ్మని ఆదేశించినారు. కావున పైన తెల్పిన SOP 5/2025 సీనియర్ సివిల్ జడ్జి కోర్టు రాజాం వున్నందున **తే 10-11-2025 ది ఉదయం 10-30 గంIIలకు** స్వయంగా కాని, మీ తరపున న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియజేయగలరు.

శ్రీ కిమిడి రామినాయుడు
శ్రీ కె.అప్పలనాయుడు
అడ్వకేట్లు, రాజాం,
సెల్ : 7093852566